కలలలోఁదప్ప!

ఓలేటి వేంకటరామశాస్త్రి

౧

ప్రతిదినమును గృష్ణమూర్తి మొగముకడుగుకొను వేళయు, రాధ తలదువ్వుకొనువేళయు నొక్కటే యగుచున్నది. కృష్ణమూర్తి కాఁపురము సేయుచున్నయింటికి దక్షిణభాగమున రమారమి యేఁబది గజముల దూరమునందే రాధ నివసించుచున్న యిల్లున్నది. ఆయింటి యుత్తరపుగదికిటికీ కెదురుగనే యుత్తరముఖముగాఁ దిరిగి ప్రతిదినము నుదయకాలమున రాధ తలదువ్వుకొనుచుండుట యొక వాడుకయైపోయినది. కృష్ణమూర్తిపడుకగది రాధయుండు గది కిటికీ కెదురుగనే దక్షిణమున నున్నది. ఉదయమున నిద్ర నుండి లేవఁగనే కృష్ణమూర్తి తన శయనగృహమునకు దక్షిణమువైపున నున్న యరఁగుమీఁదికి వచ్చి కూరుచుండి దంతధావనకర్మకు మొదలుపెట్టుచుండెడు వాఁడు. రాధకుఁ దలదువ్వుకొనుటలో నెంతో చాదస్త ముండెడిది. ఆపిల్ల శిరోజసంస్కారమున కెంతసేపటికిని దెమలుటయనునదే యుండునది కాదు. సూర్యోదయము కాఁగానే కృష్ణమూర్తికి దంతధావన సమయమున రాధాశిరోజసంస్కృతి యొక చలనప్రతిమారంగప్రదర్శన మగుచుండెడిది. తనకెదురుగా నేఁబది గజముల దూరమునఁ బొరుగింటి తరుణవయస్కుఁడొకఁడు తనవంకఁ దిరిగి యొక్కనాఁడా-కాదు-ప్రతిదినమును దాను తలదువ్వుకొనుచున్నంతసేపును దంతశోధ చేసికొనుచుండఁగాఁ బడుచుపిల్లయైయున్న రాధ యతని కెదురుగాఁ గిటికీయొద్ద నిస్సందేహముగా నిలఁబడి యంతంతసేపు చాదస్తముగాఁ దల దువ్వుకొనుట కెట్లు వెనుదీయకున్నదో — కృష్ణమూర్తి పొరుగింటి యౌవనవతివంకఁ దిరిగి యామె తలదువ్వుకొనుచున్నంతసేపును దంతధావనము చేసికొనుచు సంశయింపకుండ నెట్లు కూరుచుండఁ గలుగుచున్నాఁడో చెప్పవలయుననిన నిప్పు డెవ్వరికి సాధ్యమగును?

౨

కృష్ణమూర్తిభార్య రుక్మిణికూడ మిక్కిలి చక్కనిపిల్లయే. అంతియేకాక, మంచి తెలివితేఁటలు గలదియు, బాగుగాఁ జదువుకొన్నదియుఁగూడను! పొరుగింటిలో నున్న రాధయుఁ, గృష్ణమూర్తి భార్య రుక్మిణియు నిద్దరు నించుమించుగా నొక్కయీడువారే. ఒడ్డుపొడుగులయందును, సర్వావయవ సౌష్ఠవమందును రాధారుక్మిణులకు విశేష భేదము గనఁబడదు. కొంచె మెచ్చుతగ్గుగా నిద్దరు నొక్కతల్లి బిడ్డలవలెఁ గనుపట్టుచుందురు. ఎటువచ్చినను రుక్మిణి రాధకంటె నొక్కచాయ తక్కువయేమో. అంతే. అదియు నంతవిశేషముగాఁ జెప్పుటకు వీలులేదు. కృష్ణమూర్తికిఁ దనభార్య రుక్మిణియనిన నెంతో యిష్టము. రుక్మిణి తనకుఁ గృష్ణమూర్తివంటి యనుకూలభర్త లభించినందులకుఁ దన హృదయములో మిక్కిలి గర్వపడుచుండెడిది. ఆ తరుణదంపతు లిర్వురు నన్యోన్యప్రేమానురాగములతో బద్ధులైయుండి యపారమైన యానందమహాసముద్రములో మునిఁగి తేలుచుండెడువారు. వారి కిరువురకు నెప్పుడు నేవిధమైన యఱపొరలును లేనేలేవు. కాని యటువంటి సంసారసౌఖ్యస్థితిలో నున్నప్పటికిని గృష్ణమూర్తికి, బొరుగింటిరాధరూపలేఖావిలాసములు హృదయఫలకమున నచ్చునఁగొట్టిన ట్లంటుకొనియుండకపోలేదు. రాత్రితెల్లవాఱుదనుకఁ దన ముద్దుభార్య తనప్రక్కలోనే యుండుచున్నప్పటికిని, సూర్యోదయ మైనతోడనే లేచి పలుదోముపుల్ల నోటఁ బెట్టుకొని బయటికివచ్చి రాధాముఖసందర్శనముఁ జేసికొనినఁగాని కృష్ణమూర్తికి మఱేపనియుఁ దోఁచునదేకాదు!

3

ఆనాఁటి యుదయమున దక్షిణదిక్కునుండి మెల్లఁగాఁ జల్లని మలయమారుతము వీఁచుచున్నది. అప్పటి కుదయమున నాఱున్నఅగంటల కాల మైనది.

రాధయున్న యింటికిని గృష్ణమూర్తిపడుకటింటికిని నడుమనున్న పెరటిలో రుక్మిణిపెంచిన పారిజాతపుఁ జెట్టు సంపూర్ణముగాఁ బుష్పించి తన మనోహరపుష్ప సౌరభ్యమును నలువంకల వెదఁజల్లుచుండెను. రాధ గతదినమున ముడిచికొనిన బొడ్డుమల్లెలబంతి తన తల నుండి తీసివైచి గవాక్షములోనుండి బయటకు విసరి వైచి తన దీర్ఘవేణీబంధమును సడలించి జడయంతయుఁ జక్కఁగా విప్పివైచి, నల్లఁగా నిగనిగలాడుచున్న యాతలవెంట్రుకలకు గమగమలాడు కేశరంజనతైల మును రాసి దువ్వుట కారంభించినది. కృష్ణమూర్తి దక్షిణవాయువునకు దిగువగాఁ దన పడుకగదియరఁగుపై యథాపూర్వముగా దంతధావనముఁ జేయ నారంభించి నాఁడు. ఒకప్పుడు పారిజాతపుష్పపరిమళమును, మఱి యొకప్పుడు రాధతలకట్టునకు రాచికొనిన కేశరంజన తైలవాసనయును గప్పుగప్పున వచ్చి కృష్ణమూర్తికి నాసికాపుటతర్పణము చేయుచుండెను. రుక్మిణి వంట యింటివసారాలోఁ "గాఫీ" కాచి సిద్ధముగా నుంచినది. కృష్ణమూర్తి పలుదోముపుడుక నోటిలోఁ బెట్టుకొని పర ధ్యానముగాఁ బండ్లుదోముకొనుచుఁ దనమనస్సులో నేది యో దీర్ఘాలోచన చేయుచుఁ గాఫీమాట మఱచిపోయి రాధవంకఁ దిరిగి యట్లే కూర్చుండిపోయినాఁడు. రాధ యెందులకో యొక్కమాఱు చిఱునవ్వు నవ్వినట్లు కృష్ణ మూర్తికనులకుఁ గనుపట్టినది. ఆనాఁ డామెచూపులలో నేదియో నూతనవికాస మావిర్భవించినట్లుకూడఁ గృష్ణ మూర్తి భావమునకు గోచరించినది. రాధ, మొట్టమొదట నొకసారి చక్కఁగాఁ దలదువ్వికొని పువ్వులు చుట్టుకొని ముగించి వెడలిపోయి మరలఁ దత్క్షణమే తిరిగివచ్చి చుట్టుకొన్న పూవులు తీసివైచి యల్లుకొన్న జడ విప్పి వైచి మరలఁ దలదువ్వుకొనుట కారంభించినది. రాధా రమణి మఱికొంతసేపు తనకన్నులయెదుటఁ దాండవ మాడిపోవుటకే యట్లు పునశ్శిరోజ సంస్కృతియందుఁ బ్రవర్తిల్లియుండు నని కృష్ణమూర్తి తనహృదయమున భావించుకొని యువ్విళ్లూరుట కింకనేమి యభ్యంతర ముండును? అతనికనుల కప్పుడు రాధాముఖసుధాకర కళాస్వాదనాసక్తియే కాని, జిహ్వకుఁ "గాఫీ" సుధారస ధారాస్వాదనాస్థ యెక్కడనుండి వచ్చును? రుక్మిణి, కాఫీ చల్లఁబడిపోవుచున్నది. భర్త యింకను రాకుండె నని తల్లడిల్లుట స్వభావమేకదా? అనుదినము నించుక యేనిఁ గాలాతిపాతము గానీయక, కాఫీత్రాగుట కలవాటుపడియున్న తనప్రియభర్త యానాఁ డట్టు లాలసించుటకుఁ గారణ మేమో కనుఁగొనవలయునని రుక్మిణికిఁ గుతూహలము గలుగుటయు సహజమే.

౪

ఒకనాఁడు మధ్యాహ్నభోజనము లైనతర్వాతఁ గృష్ణమూర్తి వాకిటిలోఁ బడుకకుర్చీలోఁ గూరుచుండి భారతీపత్రికఁ జదువుకొనుచున్నాఁడు. రుక్మిణి యత నికి సమీపముననున్న మఱియొకకుర్చీలోఁ గూరుచుండి తములపాకులకు సున్నమురాచి మడఁచి భర్తనోటి కందించుచుండెను. వీథిలోఁ దలుపుదగ్గఱ "ఏమం డోయి! కృష్ణమూర్తిగారు!" అని యెవ్వరో బిగ్గరగాఁ బిలిచిన ట్లయినది. కృష్ణమూర్తి "ఎవరువా" రనుచు లేవఁబోయినాఁడు. "తపాలాజవానులాగున నున్నాఁడు. ఉత్తరము లేవైన వచ్చినవేమో, నేను వెళ్లి తెచ్చెదను లెండు. మీరు లేవనక్కఱలే"దని చెప్పుచు రుక్మిణి తటాలున లేచివెళ్లి వీథితలుపు తెఱచినది. రుక్మిణి యూహించి పలికినపలుకు యథార్థమే యైనది. తపాలా బంట్రోతు, కృష్ణమూర్తివిలాసముగల యొకసంచి యుత్తరము రుక్మిణిచేతి కిచ్చి "దసరాబరాతము దయచేయింపవలయునని అయ్యగారితో మనవి చేయుండమ్మా" అని చెప్పి వెళ్లిపోయినాఁడు. రుక్మిణి మరల వీథితలుపు మూసివైచి గొళ్లెముపెట్టి యుత్తరము పైవిలాసము పరిశీలించుచుఁ జిఱునవ్వు నవ్వుకొనుచు లోపలికి వచ్చి యాయుత్తరము భర్తచేతి కిచ్చి "అదేమిటి? పైనున్న వ్రాఁత ఆలాగునఁ, జేత కాని యాఁడువాండ్రు వ్రాసినట్లున్నదేమిటి?" అనుచుఁ గూరుచుండెను. కృష్ణమూర్తికిఁగూడ నాజాబుపైనున్న వ్రాఁత పరిచితమైయున్నట్లు కనఁబడలేదు. కొంచె మనుమానించుచు మెల్లఁగా సంచి చింపి లోపలిజాబు నొకించుక మాటుగాఁ దెఱచి చూచి వెంటనే "సరి!

యిదా?" యని యలక్ష్యభావముగాఁ దేలఁబలుకుచు మరల నాజాబు సంచిలో నుంచివైచి తనజేబులోఁ బెట్టుకొని యేమియు లేనట్లు యథాప్రకారముగాఁ బుస్తకమువిప్పి చదువ నారంభించెను.

రుక్మిణి—అదేమిటి? "సరి! యిదా?" యని నిర్లక్ష్యముచేసి యాజాబును దిన్నఁగా విప్పి కడతేరఁ జదువనైనఁ జదువకుండ జేబులోఁ బెట్టుకొని యూరకున్నారేమి? అది యెక్కడనుండి వచ్చినదేమిటి?

కృష్ణ—అబ్బే! ఏమియు లేదు. ఆయుత్తరము మన కేమియు సంబంధించినదికాదు.

రుక్మిణి—కాకపోయినఁ గాకపోవచ్చును. కాని, యెక్కడనుండి వచ్చినదో, యెవ్వరు వ్రాసినారో కూడఁ జెప్పఁగూడదు? అంతరహస్యమైనదా యేమిటి? పోనిండు, రహస్యవిషయమైనయెడలఁ జెప్పనక్కఱయే లేదు.

కృష్ణ—అబ్బే! రహస్యమున కేమున్నది? కాకపోయిన—నాకు నీదగ్గఱ రహస్యమేమిటి? ఆజాబు, అమరాపురమున నున్న యొక స్నేహితునియొద్దనుండి వచ్చినది. దానిలోని విషయములు మన కేమియు సంబంధించియుండవు. ఆవీథినున్న అవసరాల సుబ్బారాయుడుగారికి, వారి వ్యవహారములనుగుఱించి వ్రాసినాఁడు. అంతే దానిలోని విషయములు.

రుక్మిణి—ఇవి యన్నియు వట్టి దొంగమాటలు. మీస్నేహితుఁడు వ్రాసినయెడల నదియేమి? ఆయుత్తరముమీఁది వ్రాఁత యట్లున్నదేమి, చేతఁగాని యాఁడు దాని చేతివ్రాఁతలాగున?—

కృష్ణ—వాని వ్రాఁత యెప్పుడు నట్లే యుండును. వాఁ డంతకంటె బాగుగా వ్రాయలేఁడు.

రుక్మిణి—(సాశ్చర్యముగ) అఁహఁ! నిజముగానే? మగవాం డ్రెంత విశేషముగా వ్రాయలేనివారైనను, ఎప్పుడు—నెచ్చట—నెవ్వరు—నింతపాడుగా వ్రాయుట చూడనే లేదు! మిక్కిలి చిత్రముగా నున్నదే! ఏదీ! ఒక్కమా ఆజాబు నిట్లిండు. చదివి చూచెదను. ఇంకను వ్రాఁతలో నెన్నిచిత్రము లుండునో? నాకటువంటి యుత్తరములు చదువుటయనిన నెంతయో వినోదముగా నుండును జుండీ!

కృష్ణ—(ఏమిచేయుటకును దోఁచక) ఆపాడు జాబు చదువనేమిటికి పోనిమ్ము రుక్మిణీ! భారతిలో నేదియైనఁ జదువుకొనరాదు? నే నీజాబు వారిది వారి కిచ్చివేయుదును. దానిలో నేవేవియో వ్యవహారపు గొడవ లన్నియు నుండును. ఆకారణముననే నేనును జదువమానివేసితిని. ఏదీ! నా యుత్తరీయము నిట్లు తెచ్చిపెట్టు. ఇప్పుడే యావీథికిఁ బోయి, వారి యుత్తరము వారి కిచ్చివేసి వచ్చెదను.

రుక్మిణి—ఇప్పుడు మీ రీయెండలో నింత కష్టపడి వెళ్లుట యెందులకు? నే నాయుత్తరము చూడ నిండని యడుగను లెండు. ఇంకఁ గొంచెముసే పుండి చల్లఁబాటువేళ వెళ్లి యీయవచ్చును లెండు!

కృష్ణ—అబ్బే! అందులకై కాదు! ఆ వీథి నింకను గొంచెము పనికూడ నున్నది. ఎన్నాళ్లనుండియో కంసాలివీరయ్యదగ్గర నీకమ్మలజత యట్టే యున్నది. ఎన్నిమాఱు లడిగిన "ఇదిగో, అదిగో" అనుటయే కాని యింతవఱకు నీయనేలేదు. అదికూడ నడిగి పట్టుకొనిరావలసియున్నది.

రుక్మిణి—(నవ్వుచు) పోనిండు! ఇన్నాళ్లకు అవసరాలవారి యుత్తరము పుణ్యమాయని మన యవసరాలుకూడఁ దీఱుట కవకాశము గలిగినది. వెళ్లి రండు. (అని గదిలోని పాగాకొయ్యలమీఁద నున్న యుత్తరీయముఁ దెచ్చియిచ్చుచు) మరల వేగముగా వచ్చెదరా?

కృష్ణ—(రుక్మిణి యిచ్చు కండువా యందుకొనుచు నిట్టే ముందునకు వంగి చటుక్కున నామె బుగ్గపై ముద్దుపెట్టుకొని) అబ్బే! పదినిమిషముల పని. ఇప్పుడే వచ్చివేసెదను!

రుక్మిణి—(తాంబూలపు రంగంటుకొనిన బుగ్గఁ దుడిచికొనుచు) ఈ యిచ్చకపుముద్దుల కేమిలెండు. వెళ్లి త్వరగా రండు. నేనొక్కరితను గూరుచున్న యెడల నా కేమియుఁ దోఁచకుండును.

కృష్ణ—సరి! నాకుమాత్ర మేమితోఁచును? ఇప్పుడే వచ్చివేసెదను. వీథితలుపులు దగ్గఱగాఁ బెట్టియే యుంచుము.

రుక్మిణి—కానిండు! చూతముగాదు! మగవాండ్రు చెప్పున వన్నియు వట్టిదొంగమాటలే.

కృష్ణ—ఔను! ఆఁడువాండ్రే యెప్పుడును సత్యముఁ దప్పనివారు. సరే కదా? (అని నవ్వుచు నిష్క్రమించెను.)

౫

ఇంతకుముందు టపాజవాను వచ్చి కృష్ణమూర్తి విలాసముగల యొకసంచియుత్తరమును రుక్మిణిచేతి కిచ్చిపోవుటయును, రుక్మిణి యాజాబు తెచ్చి కృష్ణమూర్తి కిచ్చుటయును, అతఁడు జాబుపైసంచి చింపి లోపలనున్న యుత్తరమును బాగుగాఁ బైకిఁదీయకుండఁగనే మాటుగాఁ గొంచెము చూచి మరల సంచిలోనికిఁ ద్రోసివేసి తనజేబులోఁ బెట్టుకొనుటయును, తరువాత దానిని గుఱించి రుక్మిణీకృష్ణమూర్తులకు జరగిన కొంత సంభాషణమునుమాత్రమే పాఠకులకుఁ దెలియును. కాని, యా జాబుసందర్భము లన్నియుఁ బూర్తిగాఁ దెలిసియుండలేదు. కావున నిప్పు డాయుత్తరములోని విషయములు పాఠకులకుఁ దెలిసికొనవలయునని యభిలాషము గలిగియుండవచ్చును. ఆసంగతులు కొన్ని మే మిప్పుడు తెలియఁజేయవలసియున్నది.

జాబుమీఁది వ్రాఁత చూడఁగనే కృష్ణమూర్తి తనమనస్సులోఁ గొంచె మనుమానపడినాఁడు. దానికిఁ దోడుగా రుక్మిణి "ఇదేమిటి, చేతగాని యాఁడుదాని చేతివ్రాఁతవలె నున్నది?" అని పలికినది. దానితోఁ గృష్ణమూర్తియనుమానము మఱికొంత బలపడినది. సంచి చింపి లోపలిజాబు కొంచెము పైకిఁ దీసి చూచినప్పు డాజాబుకడపటనున్న "ఇట్లు,

ప్రతిదినమును మీకనులముందు గనుపట్టుచు
మీకు మనోహరియై మలమల మసలుచున్న
మన్మథోపహత; లేక మదనోపహత."

అనువ్రాలు చూడఁగనే యతని యనుమానమంతయుఁ దీఱిపోయినది. తత్క్షణమే కృష్ణమూర్తిహృదయము తటతటలాడఁజొచ్చెను. అతనిమనస్సులో నేనియేవియో భావపరంపరలు సముద్రతరంగములవలె బయలువెడలి కలఁచివైవఁదొడఁగినవి. అప్పుడు కృష్ణమూర్తి రుక్మిణీ సమక్షమున నుండుటచే నతని కచ్చట నొక భావప్రధానమైన నాటకభాగము బహుకష్టముగ నభినయింపవలసివచ్చినది. అప్పటికప్పు డేదోయొకవిధముగ మిసుగుట్టుగా నభినయించివచ్చివేసినాఁడు. అంత సందర్భశుద్ధిగా లేకపోయినను గొన్ని యసత్యవిషయములప్పటికప్పు డాశుకవిత్వము చెప్పి పచ్చిబొంకులు బొంకి యెట్లో రుక్మిణిని వదలించుకొని యావలఁ బడినాఁడు. తమ వీథి దాఁటి రెండవవీథిమఱుపు దిరిగి యావీథికడపటనున్న విఘ్నేశ్వరాలయమునకుఁ బ్రక్కఁగాఁ "దాలూకాబోర్డు"వారు గట్టించిన "లోకలు ఫండు" సత్రమునొద్ద జనసంచారము విశేషముగా లేకపోవుటచే నక్కడకుఁ జేరుకొన్నాఁడు. జేబులోనున్న జాబును మెల్లఁగా వడఁకుచున్న చేతితోఁ బైకిఁ దీసి చదువుకొన నారంభించినాఁడు. సభలలో ధారాళముగా నుపన్యసించు నభ్యాసపాటవములేనివారొక్కొక్కప్పుడు తప్పనిసరియై తమ యుపన్యాసమును గాగితముపై వ్రాసికొని సభామధ్యమున నున్న పీఠముపై కెక్కి గందరగోళము నొందుచు గడగడలాడుచు నుపన్యసించుసమయమున వారిచేతిలోని కాగితమెట్లు కంపించునో యిప్పుడు మన కృష్ణమూర్తిచేతిలోనున్న జా బట్లు కంపింపఁదొడఁగినది. ఎట్లయిననేమి, చదువ నారంభించినాఁడు. ఆయుత్తర మిట్లున్నది:

"నాహృదయనాథుని యంతరంగసన్నిధికి:—

హద్దులేని ముద్దులతో వ్రాసికొన్న యార్తలేఖ.

మదీయమనోమానసతస్కరా!

చిరకాలమునుండి-[అచిరకాలమే కావచ్చును! కాని, నాహృదయమున కెంతయో చిరకాలముగాఁ దోఁచుచుండుటచే నిట్లు వ్రాసితిని.] ప్రతిదినమును నేను మీకనులముందు సంచరించుచు మీ సుందరవదనార

వింవసందర్శనలాభము నొందుచు నాప్రణయభావము నంతను జేతనైనంతవఱకు [నోటితోఁగాదు] చేష్టలతో వెల్లడించుచున్నను మీ కింకను నాయెడల ననుగ్రహము రాలేదు. మీ రీరాత్రి పదునొకండుగంటలకు నిర్జన ముగానుండు లోకలుఘండుసత్రము వీథియరఁగుమీఁద గదిలో నన్నుఁ గలిసికొని రక్షింపనియెడల నేను మరల మీ కెన్నఁడును గనఁబడుదానను గాను. ఇది ముమ్మాటి కిని సత్యము. తరువాత మీచిత్తము. ఆశపడి యర్ధరాత్రి వేళఁ దీర నే నక్కడకు వచ్చి మీదర్శనలాభము నొం దక హతాశనై యడుగంటిపోవునట్లుమాత్రము చేయ కుఁడు. ఇదియే నాముఖ్యప్రార్థన. తమరు దయతో నాసాహసమునకు మన్నించి నాజీవితమును వితజేయక నాముద్దు చెల్లించి నాతప్పు క్షమించి నారహస్యమును వెల్లడింపక యనుగ్రహించి యీయుత్తరమును జించి పాఱవేయుఁడు. మీకు నేనుకాక మఱియొక మనోహరి యున్నదని యెఱిఁగియుండియు స్వార్థపరత్వముచే నిట్టిపనికిఁబూనుకొంటిని. క్షమింపుఁడు. ఇది నాహృదయ దర్పణమున నిర్మలభావరసముతో వ్రాయఁబడిన యక్ష రములు. మీకుఁ దిన్నఁగాఁ గనఁబడునో కనఁబడవో, సావధానముగఁ బోల్చి తెలిసికొనుఁడు. నా కింకను నెంతయో వ్రాసికొనవలయునని యున్నది. కాని, మిమ్ములను విసిగించినదాన నగుదునేమోయని విరమించు చున్నాను. దివ్యచిత్తమునకుఁ దేవలయును. ఇట్లు-ప్రతి దినమును మీకనులముందు గనుపట్టుచు మీకు మనో హరియై మలమల మసలుచున్న మన్మథోపహత; లేక మదనోపహత.

పైవిలాసము:— మ-రా-రా-శ్రీ. కె. కృష్ణ మూర్తిగారికి బి. యె. గుడివాడ."

ఈ యుత్తరముఁ జదువుకొనునపుడు కృష్ణ మూర్తిమన స్సెట్లున్నదో కృష్ణమూర్తికే తెలియవల యునుగాని యితరులకుఁ దెలియ శక్యముకాదని యం దఱు నొప్పుకొనవలసినవిషయమేకదా? ఒకవేళ నను భవజ్ఞానములేని హృదయములతో మనము వర్ణించి వివ రింపఁబోయినచోఁ జేతఁగానివాని కవిత్వమువలె నస్వా భావికముగను, అరంజకముగను ఉండుటయేకాని యంతకంటె విశేషముగా నుండదు.

కృష్ణమూర్తి ముందొకసారి యుత్తరమంతయు నీదరినుండి యాదరివఱకుఁ జదివినాఁడు. కాని యతఁ డేమి చదివినాఁడో యది యతనికిఁ దెలిసినదికాదు. మనసు మనస్సులో లేనప్పుడు కమ్మమీఁదఁ గన్నులు నడచినంతమాత్రమునఁ గార్య మేముండును? ఇది పని గావని హృదయమును గొంత గుదురుపఱఁజేసికొని మరల రెండవసారి చదువనారంభించినాఁడు. ఈమాఱు కొంతవఱకు లేఖార్థము మనస్సున కెక్కినది. మూఁడవ పర్యాయము సావధానముగాఁ బ్రతివాక్యమును విమ ర్శించుకొనుచుఁ జదివినవాక్యమునందుఁ గల పదచమ త్కారము—అర్థగాంభీర్యము — భావప్రకటనము— రసతన్మయత్వము—రచనావైదగ్ధ్యము మొదలైన గుణ విశేషము లన్నియుఁ గనిపెట్టుచుఁ దన మనస్సునఁ బట్టించుకొనుచు రసగ్రహణ మొనర్చుచు మరల నా లేఖనంతయుఁ జదువుకొనినాఁడు. అప్పు డతని కా లేఖయం దొకవిధమైన కవిత్వము, గానము, విద్యా జ్ఞానము మున్నగు నెన్నోగుణములు విస్పష్టముగా నవ గతములైనవి. వెంటనే మహానందతన్మయత్వము నొంది యొకించుకసేపు మయిమఱచిపోయినాఁడు కృష్ణ మూర్తి. "రాధ—యింత రసికతగల విద్యావతియా?" అనుకొన్నాఁడు. తరువాత నామెప్రణయసాహసాతిరేక ముల కత్యంతాశ్చర్యము నొందినాఁడు. అవి యతని హృదయమును గరఁగించివైచినవి. అప్పు డతని కట్టి యారాధారమణి నిరూఢగాఢానురాగమును నిష్ఫలము గావించి, యామెయాశాలతాకుసుమములను రాల్చివైచి యామెజీవితసర్వస్వమును వీటిబుచ్చి యామెను జిన్నఁ బుచ్చుటకంటె మహాపాతకహేతువు వేఱొకటి యుండ దుచుమీయని యంతరాత్మ యనేకవిధముల బోధింప మొదలుపెట్టినది. తన కత్యంతానురూపయైన భార్య రుక్మిణియుండఁగాఁ—దన్నామె యత్యంతగాఢముగాఁ బ్రేమించినదై యుండఁగాఁ—దాను నామెయెడల బద్ధా నురాగుఁడై యుండఁగా—నిప్పు డీరాధామనోరథము నీడేర్చుటయును, రాధనుహృదయపూర్వకముగాఁ బ్రేమిం

చుటయు నుచితమగునా? అని తొలుదొలుతఁ గృష్ణ మూర్తియంతరంగమున నొకించుక సందేహపరమాణువు రేఁగినది; కాని, యాయుత్తరక్షణముననే "నేను రాధను బ్రేమించినంతమాత్రమున రుక్మిణి కపచారము చేసిన వాఁడ నెట్లగుదును? నారుక్మిణిని నేను యథాపూర్వముగఁ బ్రేమించుచునే యుందునుగాదా? పాప మిట్టి రాధ కాశాభంగముఁ జేయవచ్చునా మఱి?—ఎంత మాత్రమును జేయఁగూడదు!" అను నొక పరమధర్మ సిద్ధాంతమహావాయువు బయలుదేరి యాసందేహపర మాణువు నామడదూరమున కెగురఁగొట్టివైచినది. రాధ వ్రాసిన రసమయమైన ప్రణయలేఖను జిత్తుకాగితపు ముక్కవలెఁ జించిపాఱవైచుటకుఁ జేతులు వచ్చినవి కావు కృష్ణమూర్తికి. కాని, రాధకోరిన కోరికప్రకారము ప్రవర్తింపక తప్పినదికాదు తుదకు.

౬

"మీ రీవేళ సాయంకాలము—ప్రతిదినము వలెఁ గాక—కొంచెము పెందలకడనే భోజనమునకు రావలయును. ఆవీథిని మాయక్క బద్ధకముగా నున్నట్లు వర్తమానము వచ్చినది. ఆమెకు మాసము లన్నియుఁ బూర్తియైనవి. ఆబద్ధకము బహుశః ప్రసవవేదనకుఁ బ్రారంభావస్థయే యైయుండవచ్చును. మీకు వడ్డించిన తోడనే నేనుగూడ భోజనముచేసి చీఁకటిపడకుండ మాయక్కగారింటికి వెళ్లి రావలయును" అని మధ్యాహ్నము మూఁడునాలుగుగంటలనడుమ రుక్మిణి కృష్ణ మూర్తితోఁ జెప్పెను. "రాత్రి పదునొకండుగంటల వేళ—యువతియగు తనభార్య నొంటిగా నింట దిగ విడిచి తా నేవంకఁ బెట్టుకొని, రాధాప్రణయలేఖానుసారముగా సంకేతస్థానమునకుఁ బోవుదునా"యని తలక్రిందులుపడుచు నుపాయాన్వేషణమునకై పరితపించుచున్న కృష్ణమూర్తిహృదయమున కప్పు డామాటలు తీయని తేనెతేఁటులవలె వినవచ్చి భావికార్యానుకూల్యమును సూచించు శుభశకునములుగాఁ గనుపట్టినవి. కాని, యతఁ డప్పుడు తన హృదయాంతరాళము నంతను నింపివైచిన మహానందరసము నెంతమాత్రమును బయికిఁ దొనఁకిపోనీయక "నీ వీరాత్రి మీ యక్క దగ్గఱకు వెళ్లి కూరుచున్నయెడల నేను నిన్ను విడిచి యొంటిగా నింటిలో నీరాత్రియంతయు శివరాత్రి చేసికొనియుండఁగలనా రుక్మిణీ!" యని సానురాగాభిలాషముగాఁ దనభార్య నుద్దేశించి పలికెను. ఆమాటలు వినినతోడనే రుక్మిణి కొడలు గగుర్పొడిచి యుండవలయును మఱి. అది యట్లు జరిగినదో లేదో మనము చెప్పఁజాలము. కాని, "ఆహా! యేమి సోద్దెములు? ఏమి సొగసులు? ఏమి విడ్డూరములు? ఏమి విచిత్రానురాగములు?—వెళ్లి—మరల నొక మూడు నాలుగు గంటలలోఁ దిరిగివచ్చువఱకే యొంటిగా నుండలేరు? అంతలోనె రాత్రియంతయు శివరాత్రి యైపోవునా? ఇవి యన్నియు నొకవింతవగలు, నొకవిలాసపు వలపులును. నే నెఱుఁగుదును లెండు." అని రుక్మిణి సవిలాసముగాఁ బ్రత్యుత్తర మిచ్చెను. "ఇదిగో—నీవు, మీ యక్కగారింటి కీనాఁడు వెళ్లక తప్పనియెడలఁ బెందలకడనే యన్నిపనులును జక్కఁబెట్టుకొని వెళ్లి తిరిగియే యర్ధరాత్రివేళకో వచ్చినతర్వాత—"ఆ పనియున్నది—యీ పనియున్నది" యని యాలస్యముచేసి నన్ను బాధింపకుండ వెంటనే పరుండుటకు వీలుగా నుండునట్లు చూచికొని మఱియు వెళ్లుము. ఎప్పుడో, యేదొంగప్రొద్దునకో వచ్చి యప్పు డదియు నిదియుఁ జక్కఁబెట్టుటకు మొదలిడుదువేమో, అంతవఱకుఁ గంటిమీఁదఁ గునుకులేకుండఁ గాచికొనియుండి యప్పుడైనను సుఖముగాఁ బండుకొనుటకు వీలులేకుండ?—అందులకు నే నెంతమాత్రమును సమ్మతించువాఁడను గానుజుమీ! ఇప్పుడే చెప్పివేయుచున్నాను. తరువాత నీయిష్టము" అని కృష్ణమూర్తి రుక్మిణిని హెచ్చరించినాఁడు. రుక్మిణి తనభర్తప్రియవచనరచనాచాతుర్యమునకు మనసులో నవ్వుకొనుచు సాయంకాల మయిదుగంట లగునప్పటికే వంటచేసివైచి సర్వమును సంసిద్ధముగా నుంచి తనభర్తకుఁ దృప్తిగా భోజనముపెట్టి తాంబూలమిచ్చి తానుగూడ భోజనముచేసి యిల్లును వాకిలియుఁ జక్కఁబెట్టుకొని పడుకగదిలోని పండిలిపట్టిమంచముమీఁదఁ బరిశుభ్రముగాఁ బ్రక్కపఱచి తక్కిన చిల్లరపనులన్నియుఁ జక్కఁబెట్టు

కొన్నతర్వాతఁ దాను జక్కఁగాఁ దలదువ్వికొని బొట్టును గాటుకయుఁ బెట్టుకొని, పండుగులలోఁ గట్టుకొనుటకు దాఁచికొనిన పలుచని లేతమబ్బురంగు కోకయుఁ బొడుమురంగురైకయు ధరించి సముచితమైన స్వాభావికశృంగారవేషముతోఁ దన యక్కగారింటికిఁ బోయివచ్చుటకు సంసిద్ధురాలై, వాకిటిలోఁ గుర్చీమీఁదఁ గూరుచుండిన భర్తయొద్దకుఁ బోయి "మఱి నేను వెళ్లివచ్చెదను. మెలఁకువగామాత్రము పరుండియుండుఁడు, పిలిచినవెంటనేపలుకునట్లు. తిరిగిపండ్రెండు గంటలకు లోపుగనే రావచ్చును. పురుడువచ్చినవెంటనే మా పెద్దక్కకొడుకును సాయముతీసికొనివచ్చివేసెదను." అని చెప్పుచుఁ దములపాకులవంటి తన మెత్తనిచేతులు రెండింటితోను భర్తచెక్కులు రెండు నొత్తిపట్టుకొని ముద్దుబెటుకొని వెడలిపోఁబోయెను. కృష్ణమూర్తి యామెయావిరహము నెంతమాత్రమును సహింపఁజాలకున్నవానివలె నభినయించుచు నొక్కమాఱు రుక్మిణిని గట్టిగాఁ గౌఁగిలించుకొని యీబుగ్గను, ఆబుగ్గను గఱచి నొక్కి ముద్దుపెట్టుకొని "ఆలస్యముచేయకుచుమీ!" యని చెప్పి సెలవిచ్చెను.

౭

రాత్రి గాఢాంధకారమయముగా నున్నది. దానికిఁదోడు మబ్బుగూడఁ బట్టినది. కన్నునుగన్నుఁ గనఁబడుటలేదు. ఊరంతయు మాటుమణఁగియున్నది. కృష్ణమూర్తి మెల్లఁగా లేచి తలుపులన్నియు జాగ్రత్తగా గొండెములువెట్టి వీథితలుపునకుఁ దాళమువైచి బయలుదేరినాఁడు. రెండవవీథిచివరనున్న లోకలుఫండు సత్రముదగ్గఱఁ బట్టపగలే మనుష్యసంచారము తక్కువ. రాత్రి, అందును రమారమి పదునొకండు గంటలవేళ-వేఱె చెప్పవలసిన దేముండును? సత్రమన్న పేరేకాని యక్కడకు బాటసారు లెవ్వరును దఱచుగా రానేరారు. ఎప్పుడైన నూటనాఁట నెవ్వరైన వచ్చి యొక రాత్రియో, యొకపగలో విశ్రమించిపోవుచుందురు. ఆ సత్రమువీథియరఁగులమీఁద రెండువైపులను రెండు చిన్నగదులు గలవు. వానిలో నొకదానిలో సత్రముకాఁపరియగు నొక ముసలితాత నివసించుచుండును. రెండవదానిలో నెప్పుడైనఁ దప్పిజాఱి యేబాటసారియైన వచ్చినయెడలఁ గొంతతడ వుండిపోవుచుండును. చాల మంది పాంథులు వచ్చినప్పుడుగాని సాధారణముగా లోపలితలుపులు తీయవలసిన యవసరమే యుండదు. సత్రము కట్టినతర్వాత నట్టియవసర మొకటిరెండు సారులకంటె నధికముగా వచ్చియుండదు. ఆ సత్రము తాలూకాబోర్డువారి వ్యయనిర్ణయపట్టికానుసారముగాఁ గట్టఁబడినదేకాని ప్రజోపయోగము ననుసరించి కట్టఁబడినదికాదు. దానివిమర్శనము మన కిప్పు డెందులకు? పోనిండు. ప్రస్తుతము కృష్ణమూర్తి కటికిచీఁకటిలో సత్రముసమీపమునకు వచ్చియున్నాఁడు. అతనికిఁ దన యూరిలోఁ జిరపరిచితమైయున్న మార్గముగావున నట్టి చీఁకటిలో నప్పు డచ్చటికి రాఁగలిగెనుగాని మఱియొక క్రొత్తబాటసారి కట్టిసమయమున నచ్చటికి వచ్చుట దుస్సాధ్యమేయగును. ఇదియునుగాక ఆనాఁటి మధ్యాహ్నమే రాధారమణిరహస్యలేఖఁ జదువుకొనుటకుఁ గృష్ణమూర్తి యక్కడకు వచ్చినపుడు చూచికొని పోయినచోటే యయ్యెను. అతని కిప్పు డెంతచీఁకటిగానున్న నేమికష్టము? కృష్ణమూర్తి సత్రముగుమ్మము నొద్దకుఁ బోవునప్పటి కతనిముందు రెండుబారలదూరమున నొకమనుష్యవ్యక్తి నడచుచున్నట్లు చూచాయగాఁ గనుపట్టినది. అంత నతఁడు వడివడిగాఁ గొన్నియడుగులు నడచి యావ్యక్తినిసమీపించి రహస్యముగా, "అయ్యో! రాధా! ఇంతచీఁకటిలో నాకొఱ కెంతకష్టపడి వచ్చినావోకదా, పాపము!" అనుచు మెల్లఁగా నావ్యక్తిబుజముమీఁదఁ దనచేయి వైచి దగ్గఱగాఁ దీసికొని దానితోఁగూడ సత్రపుగుమ్మము మెట్లెక్కినాఁడు. నేను మీకొఱ కేమియుఁ గష్టపడనేలేదు. నేను ప్రార్థించుటయే తడవుగా నను గ్రహించి మీరు రానేవచ్చినారు. ఇప్పుడు నేఁబడిన కష్టమంతయు నాకొఱకేకాని మీకొఱకుఁగాదు." అని యావ్యక్తి గుసగుసలాడినది. ఆవలియరఁగుమీఁద గడ్డిపఱచుకొని దానిమీఁద ప్రాఁతగోనెగుడ్డ ప్రక్కవేసికొని పండుకొనియున్న ముసలితాత "ఎవరువారు బాబూ?" అన్నాఁడు. పట్టపగలే తిన్నఁగా గన్నులుగనఁబడని

ముసలితాత కట్టి గాఢాంధకారములో నచ్చటికి వచ్చినవా రెట్లు కనఁబడినారని యొకప్రశ్న వచ్చునేమో! నిజముగా ముసలితాత కప్పు డామనుష్యులు కనఁబడిగాని, వారిమాటలు వినఁబడిగాని వాఁ డిట్లు పలికియుండలేదు. రాత్రులయందు మెలఁకువవచ్చినపుడెల్ల జాగ్రత్తకొఱకు వాఁ డిట్టు లూరకయే యడుగుచుండుట యలవాటు. ఎప్పుడైన నేయధికారులైన వచ్చి కాకతాళన్యాయముగా వినుట తటస్థించినయెడల "వీఁ డింతభద్రముగా నున్నాఁడుగదా!" యని సంతసింతురని వాని యభిప్రాయము. ఈరహస్యము కృష్ణమూర్తికిఁ గాని, యతనితో నున్న వ్యక్తికిఁగాని యేమి తెలియును? ముసలివానిప్రశ్నము తటాలునఁ జెవినిబడిన తోడనే కృష్ణమూర్తిచెట్టనున్న వ్యక్తి తబ్బిబ్బుపడి యులికిపడెను. కృష్ణమూర్తియు మొదటిఁ గొంచె మదరిపడెను గాని తరువాత నాముసలివాఁడు తమ్మట్టి కటికిచీఁకటిలో నెంతమాత్రము నానవాలుపట్టఁజాలఁడని దృఢవిశ్వాసముగలవాఁడుగావున వెంటనే ధైర్యము వహించి కంఠస్వరము నొకించుక మార్చివేసి "ఏమి తాతా! మేము మార్గస్థులము. ఈరాత్రి కొంచెము సేపిచ్చటఁ బరుండి తెల్లవారకముందే లేచి వెళ్లిపోవుదుము. వెళ్లునప్పుడు నీ కేమైన నిచ్చిపోవుదుము లే. మేమిప్పు డిక్కడఁ బరుండుట కేమియు నభ్యంతరము లేదుగదా?" యని యడిగెను. ముసలితాత కన్నులుమూసికొని యంతకుముం దెట్లు పండుకొనియుండెనో యట్లే పండుకొనియుండి "చిత్తము, చిత్తము, దయచేయుండు. మీ కభ్యంతర మేమున్నది? మీవంటివారికొఱకేకాదా, బాబా, సర్కారువా రీసత్రము కట్టించినారు? అదిగో! ఆవలియరఁగుమీఁద గదిలో ఈఁతాకుల చాప యున్నది. సందకడనే శుభ్రముగా దులిపి తుడిచి బాగుచేసియున్నాను. బాబూ! మహారాజులలాగునఁ బరుండుఁడు. చిత్తము. వెళ్లఁబోవునప్పుడుమాత్రము నా మాట కాసంత మఱచిపోకుండు బాబూ! నల్లమందు కొనివేసికొందును; బీదముండవాఁడను" అన్నాఁడు. "సరిలే; నీ వింకఁ బండుకొనుము." అని చెప్పి కృష్ణమూర్తి తనతోనున్నవ్యక్తితో నాగదిలోఁ బ్రవేశించెను.

౮

కొంతసేపైనతరువాత నాగదిలో జరిగిన సంభాషణములు:

వ్యక్తి—ఆహా! నాథా! యెంతకాలమునకుఁ నేను ధన్యురాల నైతిని? మీకు నాయం దింత యనుగ్రహము, ననురాగము నుండునాయని సంశయించి యింతవఱకు సాహసింపలేనైతిని. (అని కృష్ణమూర్తిని దృఢముగాఁ గౌఁగిలించుకొని ముద్దుపెట్టుకొనెను.)

కృష్ణ—రాధా, నీవు నాయం దింతగాఢానురాగము గలదానవని తెలిసికొనలేకపోతిని. లేనియెడల—

రాధ—ఇప్పుడు తెలిసినదిగాదా? ఇంక నన్ను విడువకుఁడు. అంతియే చాలు. నే నింక మిమ్ములను విడిచియుండలేను. పదుండు; మీతోఁగూడ వచ్చివేయుదును.

కృష్ణ—(రాధను ముద్దుపెట్టుకొని) ఓసీ! నా ముద్దులరాణీ! ఎక్కడ నేర్చితి వీమాటలు? నీ విప్పుడు నాతోఁగూడ వచ్చివేయుదువేమి? ఎట్లు రాఁగలవు? వచ్చినచో మాయింటిదాఁక రాఁగలవు. అంతే. అంతకు మిక్కిలి వచ్చుట కెట్లు వీలగును? నీతల్లిదండ్రు లూరకుందురా? నీభర్త సహించునా? లోక మోర్వఁగలదా? సరిలే; ఆమాటల కేమి లెమ్ము. రమ్ము, మరల రహస్యముగా నిండ్లకుఁ బోవుదము. (అని, యీలోపునఁ దన భార్య యింటికి వచ్చివేయునేమో యనుశంకతోఁ ద్వరపడుచుండెను.)

రాధ—పదుండు. మీరు నామాటలు విశ్వసించుటలేదుకాఁబోలును. నాకు నాతల్లిదండ్రులతోఁగాని, యీలోకముతోఁగాని పనిలేదు. నేను నాహృదయపూర్వకముగాఁ బ్రేమించుకొన్న మీరే నాభర్తగాని వేఱెవ్వఁడును నాభర్తగాఁడు. నే నీనాఁటితో సర్వమును విడిచిపెట్టితిని. మీరే నాకు సర్వమును. మీకింకను నాసంగతి పూర్తిగాఁ దెలియలేనట్లున్నది. నేను మిమ్ములను విడుచుదాననుగాను. మీవెంటనే వచ్చివేయుదును. పదుండు. (అని బయలుదేరెను.)

కృష్ణ—నీ విప్పుడే యింతతొందరపడెద వేల? నే నిట్లే తఱచుగా వచ్చి నీతోఁ గలిసికొనుచుందును. కొంతకాల మిట్లు పోనిమ్ము. తరువాతఁ జూచికొన వచ్చును.

(అని మెల్లమెల్లఁగాఁ బలుకుచు రాధచేయిబట్టుకొని సత్రపుగుమ్మము మెట్లు దిగెను.)

రాధ—అయ్యో! పాపము! ముసలితాతమాట మఱచితిమి. ఇదిగో, ఈరూపాయి వాని ప్రక్కమీఁదఁ బడవైచిరండు. ప్రొద్దున లేవఁగానే చూచుకొని సంతోషించును. వాని పుణ్యమున నా కీనాఁడు మీతో మహానందము ననుభవింపఁజేకూరినది. (అని పలుకుచుఁ జీరకొంగున నున్న ముడివిప్పి యొకరూపాయి కృష్ణమూర్తిచేతి కీయఁబోయెను.)

కృష్ణ—అది నీ వీయనక్కఱలేదు. నే నిచ్చెదనులే. నాయొద్ద నున్నది. (అని తనజేబులోనుండి యొకరూపాయిఁ దీసి తిరిగి వెనుకకు వెళ్లి ముసలితాత ప్రక్కమీఁదఁ బడవైచివచ్చెను.)

రాధ—(కృష్ణమూర్తియెడమచేయి గట్టిగాఁ బట్టుకొని) నే నింక నీచేయి విడువను. వచ్చినదానను రానేవచ్చితిని. నేను మిమ్ములను విడిచి తిరిగిపోవుదానను గాను. ఏమందురో చెప్పుఁడు మఱి. (అని మెల్లఁగా నడుగుచుఁ జీఁకటిలోఁ గృష్ణమూర్తివెంబడి నడువనారంభించెను.)

కృష్ణ—ఈనాఁటికి నీవు మీయింటికిఁ బొమ్ము. రేపు దీనికిఁ దగిన యుపాయము నాలోచింతము.

రాధ—నే నట్లు పోను. దీని కాలోచింపవలసిన దేమున్నది? మీ రొకవేళ మీభార్యవలన భయపడుచుందురేని, మన మిప్పుడు మీయింటికే పోవలదు. రండు, ఇట్లే యీద్వారినే యెక్కడకైన లేనిపోవుదము. అంతియే కాని నేనుమాత్రము మిమ్ములను విడిచిపెట్టిపోవను.

కృష్ణ—(సందేహించుచు) మన మిప్పు డెక్కడకేనిఁ బోయినయెడల, మఱి, యింతకుముందు నన్ను నమ్ముకొనియున్న రుక్మిణిమాటయో?

రాధ—మఱి-యిప్పటినుండి, మిమ్ము నమ్ముకొని, మానాభిమానము లమ్ముకొని, సర్వ సంగపరిత్యాగముచేసి, సన్న్యాసినివలె నిల్లువిడిచి యీవలఁబడిన యీరాధమాటయో?

ఇట్లు రాధయుఁ, గృష్ణమూర్తియుఁ ద్రోవలో మెల్లమెల్లఁగా గుసగుసలాడుకొనుచుఁ గృష్ణమూర్తి బసదగ్గఱకు వచ్చివేసిరి.

కృష్ణ—నీవు మీయింటిలోనికిఁ బోవువఱకు నే నీ మాగుమ్మములో నుందును. త్వరగా మీయింటికిఁ బొమ్ము. చినుకులుగూడఁ బ్రారంభించుచున్నట్లున్నవి. రేపు మరల నేఁటివలెనే సత్రమునొద్ద—

రాధ—నే నట్లు పోవుటకు రాలేదు. మీయింటి తలుపు తాళముఁ దీయుఁడు. నేను మీతో మీయింటిలోనికి వచ్చివేయుదును! (అని గుమ్మమెక్కెను.)

౯

అప్పుడు కృష్ణమూర్తికి రాధవిచిత్రప్రవర్తనము వింతఁగొలుపఁ దొడఁగెను. అతని కప్పు డేమనుటకు, నేమిచేయుటకునుగూడఁ దోఁచకుండెను. తనభార్య రుక్మిణి వచ్చివేయునేమోయని మనసులో దిగులుపడుచుండెను. అట్లారాధతో నర్ధరాత్రివేళ వీథిగుమ్మములో నిలఁబడియుండుట యతనికి యుక్తముగాఁ దోఁచలేదు. మెల్లఁగాఁ దాళముఁదీసి తలుపులుదెఱచి "రాధా, నామాట విని, నీ విప్పటి కింటికిఁ బొమ్ము" అనిమరలఁ బలికెను. రాధ లోపలఁ బ్రవేశించి తలుపులు మూసివైచి తడుముకొనుచుఁ గృష్ణమూర్తిగడ్డముక్రిందఁ జేయిపెట్టి "నాథా! న న్నింక నెక్కడకును బొమ్మనవలదు" అని బతిమాలుకొనుచు నతనితోఁగూడ వాకిటిలోనికిఁ బోయెను. అప్పుడు కృష్ణమూర్తికి వెఱ్ఱియెత్తినట్లుండెను. ఇంటిలో దీపము లేక మఱియు నంధకారమయముగా నుండెను. రాధ కామాంధకారమయమైన హృదయముతోఁ దన్ను విడువకుండెను. రుక్మిణివచ్చు వేళయై పోవుచున్నదని యతని మనస్సు పరిపరివిధములఁ బోవుచుండెను. రుక్మిణి వచ్చునప్పటికి రాధతోఁ జీఁకటి

యింట నుండుట మంచిదికాదని కృష్ణమూర్తి కొకవెట్టి యూహ తోఁచెను. వెంటనే గదిలోనికిఁ బోయి యగ్గి పెట్టె వెదకి దీపమువెలిఁగించి వాకిటిలోనికిఁ దెచ్చెను. అక్కడ నతనికనులకుఁ దనభార్య రుక్మిణి ప్రత్యక్షమయ్యెను.

రుక్మి—అర్ధరాత్రివేళ నింతచీఁకటిలో వీథి తలుపు గొళ్లెము పెట్టుకొనకుండ నట్లే యుంచితిరేమి? నేను వచ్చినట్లే-మీకుఁ దెలియకుండ- ఎవ్వరైన వచ్చి యింటిలో దూరినచో నేమిచేయుదురు?

కృష్ణ—(విస్మయమొంది,తనలో)రాధ నెట్లయిన బతిమాలి పంపివేయుదమని వీథితలుపు గొళ్లెము పెట్టక వచ్చితిని. అయ్యో! రుక్మిణివచ్చివేసినదే! (ప్రకాశముగా) నీవువచ్చెడువేళయైనదని యిప్పుడే తీసివచ్చితిని. ఇంతలో లోపలిదీపము గాలి కాఱిపోయినది. వెలిఁగించి తెచ్చితిని. ఔనుగాని, ఇంతచీఁకటిలో నీ వొంటరిగా వచ్చి వేసితి వేమి, చడియును జప్పుడునుగాకుండ?

రుక్మి—నే నొంటరిగా రాలేదు. చడియుఁ జప్పుడు నగుటకు నేనేమి మంగళవాద్యములతో వత్తు ననుకొన్నారా యేమి?

(అని హేళనముగాఁ బలికి నవ్వుచు భర్త కెదురుగా వచ్చి నిలఁబడెను.)

కృష్ణ—(అటునిటు నెందులకో కొంచెము పరికించుచు) నీ వొంటరిగా రాలేదంటివిగదా? నీతో నిప్పు డెవరు వచ్చినారు?

రుక్మి—(నవ్వుచు) మీరే!—

కృష్ణ—చాలు! నీపరిహాసములకేమిగాని నీతో నిప్పు డెవ్వరు వచ్చినారో తిన్నఁగాఁ జెప్పుము.

రుక్మి—అయ్యో! పరిహాసముకాదు! రామ! రామ! నమ్మరేమి నామాట? ఇప్పుడు నాతో వచ్చిన వారు మీరే! (అని మరల నవ్వును.)

కృష్ణ—(తనలో) ఇది యేమిటి? మాయలాగున నున్నదే? రుక్మిణి తనకు సాయమువచ్చినవారిని వీథిలో నుండియే వెనుకకుఁ బంపివైచి కొంటితనముగాఁ జీఁకటి చాటున నింటిలోఁ బ్రవేశించి నాతో వేళాకోళము లాడుచుండిన నుండవచ్చును. కాని—రాధ యేమైనది? రుక్మిణిని జూడఁగనే చీఁకటిలోఁ దప్పుకొని వెళ్లిపోయినదేమో! లేక యేమూలనైన దాఁగినదా? ఇది యొక విచిత్రనాటకమువలె నున్నదే?

రుక్మి—(నవ్వుచు) ఏమి ప్రాణేశ్వరా, అట్లు నివ్వెఱపడుచు నేదియో యాలోచించుచున్నట్లు కనఁబడుచున్నారు? నామాటలు మీరింకను నమ్మకుంటిరా యేమి?

కృష్ణ—రుక్మిణీ, నీమాట లెట్లు నమ్ముదును? నీవు చాలఁ జమత్కారిణివి. నీ విప్పు డేదియో మోసముచేసి నన్ను వెఱ్ఱివానినాడించిన ట్లాడింపఁజూచుచున్నావు. నేను నీటక్కరితనమునఁ జిక్కుపడువాఁడను గాను. తిన్నఁగాఁ జెప్పుము. నీ కెవరు సాయము వచ్చినారు? నిన్ను ముద్దుపెట్టుకొందును. లేనియెడల నేను నీమీఁదఁ గోపగించెదను.

రుక్మి—(సవిలాసముగా భర్తను గౌఁగిలించుకొని యతనిమోమువంకఁ జూచి నవ్వుచు) మీ రింతకు ముందు వీథిలోనుండి వచ్చుచున్నారా, లేదా? నిజముగాఁ జెప్పుఁడు.

కృష్ణ—ఔను! వచ్చుచుంటిని. ఇప్పు డిందు నిజముచెప్పక యబద్ధముచెప్పవలసిన పనేమున్నది? నీ వింతప్రొద్దుపోయినను మీయక్కగారింటినుండి రాలేదేమని నేను నక్కడకు రావలయు ననుతలంపుతో బయలుదేరి వీథిలోఁ గొంచెముదూరము వచ్చిపోనీ యెందుల కింతతొందరయని తిరిగివచ్చివేసితిని. నీవును వచ్చువేళ యైనదిగదాయని తలుపులుగూడ గొండెముపెట్టక దగ్గఱగా మూసివచ్చితిని. ఆఱిపోయిన దీపమును నేను మరల వెలిఁగించి తెచ్చునంతలో నీ విట్లు దొంగచాటుగా వచ్చియుందువు. ఇంతేనా?

రుక్మిణి—నాథా, తొందరపడక క్షమించి నే నడిగెడువాని కన్నిటికిని సరిగా సమాధానములు చెప్పవలయును.

కృష్ణ—(తనలో) రుక్మిణి నాసంగతులేమైనఁ గనిపెట్టియుండునా యేమి? (ప్రకాశముగా) అదు గుము! నీ విప్పు డడుగుట కేమున్నది? నేను జెప్పుట కేమున్నది?

రుక్మి—ఏమియు లేదు-మీ రింటిలోనికి వచ్చు నపుడు మీవెనువెంటనే మీతో నింటిలోనికి వచ్చిన వా రెవరు?

కృష్ణ—(తనలో) రుక్మిణి రాధను జూచిన ట్లున్నది. ఏమి సాధనము?—అయినను దొందరపడి తేలిపోఁగూడదు. ఇట్లు పలికి చూచెదను. (ప్రకాశముగా) ఎవ్వ రున్నారు? ఎవ్వరును వచ్చియున్నట్లు లేదే? నీవే యొకవేళ రహస్యముగాఁ-జీఁకటిలోఁ గనఁబడ కుండ వచ్చియుంటివేమో!

రుక్మి—(భర్తను ముద్దుపెట్టుకొని) నాథా! ఇంక మీతోట నేను విశేషముగా నబద్ధములు పలికింపఁ దలఁచుకొనలేదు. జరగినదంతయు నేనే యథార్థ ముగాఁ జెప్పివైచెదను. "క్షమించెద"నని యీచేతిలో చేయివేయుఁడు.

కృష్ణ— (తొట్రుపాటుచే రుక్మిణిమాటలు తిన్నగా తెలిసికొననేరక సంశయించుచు) క్షమించుట కిప్పుడు నీతప్పేమియున్నది? జరిగినదంతయు యథార్థ ముగాఁ జెప్పివైచెదనంటివిగదా? ఏమి జరిగిన దిప్పుడు?

రుక్మి—ఇంక నవి యన్నియు నెందులకు? "క్షమింతు" నని యీ చేతిలోఁ జేయివేయుఁడు, చెప్పుదును.

కృష్ణ—(తనలో) ఇది యేమిటో నాకుఁ దెలి యుటలేదు. రుక్మిణి యేమిచెప్పునో చూడవలయును. (ప్రకాశముగా) ఇదిగో! ముమ్మాటికి "నిన్ను క్షమిం చెద" నని చేతిలోఁ జేయివేయుచున్నాను. ఏమి జరగినదో, నీ వేమి చెప్పెదవో చెప్పుము; చూతము మఱి—(అని గంభీరముగాఁ బలుకుచు రుక్మిణిచేతిలోఁ జేయివేసెను.)

రుక్మి—(ముసిముసినవ్వులు నవ్వుచు) జరగుట కేమున్నది? నాథా! లోకలుఫండుసత్రము వీథిగదిలో నా కిదివఱ కెన్నఁడును జరగియుండని మహానందోత్స వము జరగినది! ఇంతకాలమునకు మిమ్మును ఈదినమున నచ్చట నే నొక్కింతసేపు మహానందసౌఖ్యములలో నోలలాడించి, మీలో నిమిడియున్న ప్రణయానురాగ రససర్వస్వమును నే నాస్వల్పకాలముననే చూఱలాడి ధన్యురాలనగుట జరగినది!!

కృష్ణ—(రుక్మిణికౌఁగిటిలో నిశ్చేష్టుఁడై నిలఁ బడిపోయెను.)

రుక్మి—నాథా! నేను జేసిన యీ యసాధా రణసాహసకృత్యమునకు నన్ను మీరు క్షమింతు రని తలఁచితిని. కడచిన మధ్యాహ్నవేళ మనము వాకిటిలోఁ గూరుచున్నప్పుడు "తపాలా జవాను" తెచ్చియిచ్చిన సంచియుత్తరము నేను వ్రాసినదే. ఇదిగో! దానిప్రతి (నకలు) నాయొద్ద నున్నది. చిత్త గింపుఁడు. ఈయుత్తర మిప్పుడు మీరు మరలఁ జదివి కొని చూచినచోఁ జాలవఱకు నాకును అన్వయించును. నేను వ్రాసితి నను బుద్ధితో మరలఁ జదివిచూడుఁడు! దీనికి మూల మేమనఁగా కొలఁదిదినములక్రిందట మీ రొకనాఁటి యుదయమున మన దక్షిణపుగదియరఁగు మీఁద దంతధావనము చేయుచుఁ బరధ్యానముగాఁ గాఫీ పుచ్చుకొనుటకైనను రాక "చల్లాఱిపోవుచున్నది; త్వరగా రం"డని నేను గేకవైచినను వినిపించుకొనక యాలస్యముచేసితిరి. జ్ఞాపకమునకుఁ దెచ్చికొనుఁడు! అప్పుడు, మీ రేల రాకుంపితిరో యని సన్నసన్నగా గదిలోనికి వచ్చి మీకు వెనుకతట్టున నున్న కిటికీలో నుండి యిట్టె తొంగిచూచితిని. మీ కెదురుగాఁ బొరు గింటిగదిలోఁ గిటికీయొద్ద రాధయను సుందరి తలదువ్వు కొనుచుండుటయు, మీ రామెవంకఁ దిలకించుచుఁ బరా యత్తచిత్తులై యుండుటయు నేను గనిపెట్టి వెంటనే వచ్చివేసితిని. రాధానుబద్ధహృదయులై యున్న మిమ్ము, మీముచ్చటఁ దీర్చి యానందపెట్టుట యెట్లో యని దీర్ఘముగా నాలోచించితిని. తుదకు నే నాయుత్త రము నెడమచేతితో రహస్యముగా వ్రాసి మంచినీళ్ల నూతికిఁ బోయినపుడు, ఎవ్వరును జూడకుండఁ దపాలా పెట్టిలోఁ బడవైచి వచ్చితిని. తక్కిన వృత్తాంతమం

యుత మీ కిప్పు డవగతము కాఁగలదు. ఇట్లు మహా సాహసముతో మిమ్ము వంచించినందులకే న న్నిప్పుడు క్షమింపుఁడని ప్రార్థించితిని.

కృష్ణ—(నిలువున నీరయిపోయి) రుక్మిణీ, నేనుగాను నిన్ను క్షమింపఁదగినవాఁడను! నీవే నన్ను క్షమింపఁదగినదానవు! నేను నీయెడలఁ జేసిన యప రాధములకు - వంచనములకు - అసత్యములకు- హద్దును బద్దును లేదు. న న్నీపాప మెట్లు కట్టికుడుపునో తెలి యదు. నీవంటి రూపవతి- నీవంటి వయోవతి- నీవంటి సద్గుణవతి- నీవంటి విద్యావతి- నీవంటి సాహసౌదార్య వతి-నీవంటి యనురాగవతి-నీవంటి మహాపతివ్రత భాగ్య వశమున భార్యయై యుండఁగాఁ దృప్తిలేక- బుద్ధిలేక- పాపభీతి లేక-పరులయింటి పతిపత్నులకై యువ్విళ్లూరిన పాపాశయుఁడను. ఇప్పటికి నాతప్పు నే నెఱిఁగి పశ్చా త్తప్తుఁడ నగుచున్నాను. నీవు న న్నట్టి పాపవ్యాపార మునఁ బడిపోవకుండ నుద్ధరించి కాపాడిన పరమపతివ్ర తవు. మహోపకారిణివి. నీవే నిజమైన గృహలక్ష్మివి. నే నింకముం దెన్నఁడు నిట్లు నిన్నుఁగాదని యేపాపమును జేయఁబూనను- దైవముతోడు - నీతోడు-నీవు నాహృ దయమాలిన్య—

రుక్మి—(నవ్వుచు భర్తనోటిని దనచేతితో మూసి) ఏమి టీమహోపన్యాసము? నాథా! దాని కేమి గాని-నన్ను-మీప్రియభార్యనైన నన్ను-మీతోఁ గొంత కాలమునుండి కాఁపురముచేయుచున్న నన్ను-మీ రిం చుకయైనఁ బోల్చుకొనలేకపోతిరేమి?

కృష్ణ—రుక్మిణీ, ఏమని చెప్పుమందువు? అసలే గాఢాంధకారము. దానికిఁదోడు కామాంధకారము, అన్నిటిని మించినది యజ్ఞానాంధకారము! ఇన్ని యంధకారము లేకమైనప్పుడు నీ యాకారము నెట్లు పోల్చుకొనఁగలుగుదును? భ్రాంతిమయప్రపంచమున సంచరించువానికి బహిఃప్రపంచజ్ఞాన మెక్కడిది వట్టి మూఢత్వముతప్ప?

రుక్మి—అబ్బబ్బా! చెప్పిన నమ్మెదరో నమ్మ రోకాని—నే నారెండుగడియలును నామాటలు మీ రెక్కడ నానవాలుపట్టిపోవుదురోయనియును, నావాసన మీరెక్కడఁ బసిపట్టెదరో యనియును, నాచేతలు మీ రెక్కడ గుర్తించిపోవుదురో యనియును నేను బడిన బాధయు, నేను జేసికొన్న మార్పులు నిన్నియన్ని కావు. తుద కవియన్నియు సఫలమైనవి. ఇంక నా ప్రసంగముఁ గట్టిపెట్టి రండు! ప్రొద్దుపోయినది. పరుండుదము.

కృష్ణ—రుక్మిణీ, నీవు నాకుఁ జేసిన మేలు నకుఁ బ్రతిగా నీ కీజన్మమునఁగాదుగదా, నూఱుజన్మ ములయందైనను ఏమియుఁ జేయఁజాలను. కాని నేను నీ కిప్పు డీయఁజాలిన దేదేని యొకటి గోరికొని నన్నుఁ బరితృప్తుని జేయకతప్పదు.

రుక్మి—(మహానందముతో భర్తను గౌఁగిలించు కొని) అయితే నాకిప్పు డొక్కము ద్దీయుఁడు! నా కదిచాలును. (అని భర్తను ముద్దుబెట్టుకొనెను.)

కృష్ణ—అట్లుకాదు. మఱియొకటి కోరు కొనుము.

రుక్మి—నా కేమియు నక్కఱలేదు. కాని, మీయాజ్ఞానుసారముగా నేనియైనఁ గోరుకొనకతప్పదు కావునఁ గోరుకొనుచుంటిని. వినుఁడు. ఇందాఁక "లోకలుంఠండు" సత్రముగదిలో నన్నుఁ జీఁకటిలో రాధయని భ్రమించి చూపించిన గాఢానందానురాగ విలాసాదులే నాయెడల మీ రెప్పుడును జూపించు చుండుఁడు. నా కంతకంటెఁ గోరికొనఁదగిన వేఱు కోర్కె లేవియు లేవు.

౧౦

మన మింతవఱకు నీగ్రంథమునఁ జేర్కొనిన రాధాపాత్రసందర్భ మేమియుఁ దెలుపకుండ నీగ్రం థము నిట్లు ముగించుట యుక్తముగాదు. కావున దానిని గుఱించి యేనియొకొంత సంగ్రహముగానైనఁ జెప్పి వేయకతప్పదు.

రాధ, మొట్టమొదటినుండి కట్టకడవఱకును నిర పరాధయే. ఆమెయెడల నేదోషమును- లేశమైనను-

లేదు. ఆమె ప్రతిదినమును దనవాడుకచొప్పునఁ దనగది లోఁ దనవారిని దాను దలదువ్వుకొనుచుండుటయేకాని, యెన్నఁడును గృష్ణమూర్తిమనఃప్రవృత్తులు గమనించి యెఱిఁగినదికాదు! ఎప్పుడైన నొకవేళఁ గృష్ణమూర్తి వంకఁ జూచియుండినను, ఆచూపు హృదయపూర్వకముగాఁ- దా నాతనిఁ జూడవలయునని- చూచినచూపే కాదు. ఆమఱునాఁ డామె తనతల్లిదండ్రుల యాదేశానుసారముగాఁ దనభర్తతోఁ గూడి యత్తవారింటికి వెడలిపోయినది. రాధ యొకనాఁడు, ముసిముసి నగవులతోడను, నూతనవికాసదృష్టులతోడను గనుపట్టుచు రెండు మాఱులు తనజడ విప్పి మరల వేసికొని శృంగారించుకొనుటలోఁ గొంత యడావుడి చేసియున్నదిగాదా? ఆనాఁడు తన కూరిమిభర్త తన్నుఁ దీసికొనిపోవుటకు వచ్చుచున్నాఁడని తెలిసికొనియే భర్తృభావనావశంవదహృదయయై యన్నిపోకడలు పోయినది. ఆతర్వాత నామె తన యత్తవారింటఁ దన గృహిణీత్వమును దాను జక్కఁగా నిర్వహించుకొన మొదలుపెట్టెను. కృష్ణమూర్తికంటికి మరల రాధ యెన్నఁడును గనఁబడుట లేదు—కలలలోఁదప్ప!—

మా రు కు*

"మామ"

త్రిక్కకవిపల్కులోని పొందికయుఁ దెలివి,
పోతనార్యునిగడలోని మురుపుబరువు,
షేక్స్పియర్నుడిలోని నైశిత్యసరణి,
యమ్మ, నీపల్కులకు లఘువ్యాఖ్యలేమొ!

అరయ నీభాష యేదో! యం దర్థమేదో!
పరసము గురియునో! చెప్పనేర నమ్మ!
కవి కవితకును, గాయకు గానమునకుఁ
బ్రాణములు వోయుదీపి నీవాణిఁ గలదు!

కళలు సర్వము కృతకముల్ గావటమ్మ!
ప్రకృతిసిద్ధములయిన నీపలుకు విన్న
వార లెవరేని నినుఁ దనివారఁ జీరి
యొలసి ముచ్చట ముద్దాడకుందురమ్మ!

చదివెడినప్పు పల్కితివ
చల్లగ పొత్తము మూయనేవలెన్!
కదలెడునప్పు పల్కితివ
కాలుగదల్పక నిల్వనేవలెన్!
పదరినయప్పు పల్కితివ
పక్కున నవ్వి శమింపనే వలెన్!
ఎదియొ యలౌకికప్రకృతి
యేచి యెలర్చెడు నీదుపల్కులన్.

కోయిల 'కుహూకృతి'నిఁగల్గు తీయఁదనము,
సత్కవిత్వమునఁ గల రసప్రశస్తి
గలిగి జగమలరించు నీలలితమధుర
కలరవములకు ముద్దులకాన్క గొనుము.

---

* మేనగోడలు. వయసు ఒకటిన్నరయేఁడు.